క్లుప్తంగా

వ్యవసాయంపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నల గడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యవసాయంపై వ్యాసరచన, చిత్రలేఖనం, పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏజీ సువర్ణలత, ఏడీ డాక్టర్ ఎం రమాదేవి, విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పాఠశాల పరిసరాలను పరిశుభ్ర పరిచారు.

నేడు మెగా పేరెంట్- టీచర్ మీటింగ్

పెదకాకాని: బడి వైపు ఒక అడుగు తల్లిదండ్రులతో ముచ్చట్లు కార్యక్రమంలో భాగంగా శనివారం మెగా పేరెంట్- టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి శంకరరాజు తెలిపారు. పెదకాకాని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొంటారన్నారు.

మహానటి సావిత్రికి నివాళి



నగరంపాలెం: కళా దర్బార్- అమరావతి అధ్వర్యంలో మహానటి సావిత్రి జయంతి సందర్భంగా శుక్రవారం నాజ్ కూడలిలోని ఆమె కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళా దర్బార్ - అమరావతి వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించగా, సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు చందవోలు శోభారాణి విచ్చేసి నివాళులర్పించారు. గాయనీ, గాయకులు మిరియాల ప్రసాదరావు, కె.బాబూరావు, టి.సుధీర్ బాబు, అరికపూడి సాంబశివరావు, సౌజన్య బృందం సావిత్రి నటించిన చిత్రాల్లోని గీతాలను అలపించారు. కళాదర్బార్ సంస్థ సభ్యులు రాజశేఖర్, ధర్మ సింగ్, మహిళా సభ్యులు విజయలక్ష్మి, రాధ, నాగేశ్వరి పాల్గొన్నారు.

జనగణనతో పాటే కులగణన చేపట్టాలని వినతి

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనతో పాటే సమగ్ర కులగణన కూడా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీల సమగ్ర అభివృద్ధి కులగణనతోనే ముడిపడి ఉందన్నారు. భవిష్యత్తులో ఓబీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అలరించిన నారాయణ తీర్థుల తరంగాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత కళాశాల సంయుక్తంగా శ్రీనారాయణ తీర్థుల తరంగాలు అనే గాత్ర కచేరి నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంపత్‌కుమార్ అలపించగా తరంగాలు శ్రోతలను అలరించాయి. ముఖ్య అతిథిగా డీఆర్ఎం సి.రామకృష్ణ, శంకర కంటి ఆస్పత్రి చీఫ్ మెడికల్ అధికారి పి.సుధాకర్ హాజరై మాట్లాడారు. నాగార్జున కల్చరల్ సెంటర్ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి

గుంటూరు మెడికల్: పారా మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు పారా మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు, సెక్రెటరీ నందిగామ నాగరాజు వినతి పత్రం అందజేశారు. సరైన వేతనాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, పారా డికల్ ఉద్యోగుల సర్వీసును పరిగణలోకి తీసుకొని కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ పథకాల అమలు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖలో పని చేసే ప్రతి ఒక్కరికి 35 క్యాజువల్ లీవ్స్ వర్తించేలాగా కొత్త జీవో తీసుకురావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన నాయకులు

గుంటూరు రూరల్: ప్రపంచం గర్వించదగిన రాజ్యాంగాన్ని భారతావనికి అందించిన ఘనుడు మన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. బలసాని మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ఆయన ప్రతి ఒక్కరికి మార్గదర్శకుడని తెలిపారు.

అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

కాకుమాను: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం భారతరత్న అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉన్నదని అలాంటి విద్యకు ఎవ్వరు దూరం కాకుడదని ఆయన బోధించేవారని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో-2 కె.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటస్వామి అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి మాట్లాడుతూ సమాజంలో అంటరాని తనాన్ని పారద్రోలడానికి అంబేడ్కర్ ఎంతో గానో కృషి చేశారని తెలిపారు.అలాంటి మహోన్నత వ్యక్తి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి పొన్నూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ భవనం పద్మలీల, నాయకులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్. నాజర్, గేరా సంజీవ్, ఎండేటి వెంకట సుబ్బయ్య, మూర్తిరాజు పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి కార్యాలయంలో..

ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి అరేటి రామారావు, కళాకారులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఘంటా రాజేంద్ర కుమార్, కిషోర్, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెదకాకానిలో..

పెదకాకాని: భారత దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన నాయకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీపీఎల్ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో శుక్రవారం వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేముల విజయ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్థానికులు గోళ్ల శ్యామ్ ముఖర్జీబాబు, సంగుల సంగీతరావు, సంకూరు పండు, లింగంగుంట కిషోర్, పాటిబండ్ల మంత్రయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా నాట్యమండలి సభ్యులు



అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

డాక్టర్ అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ: అంబేడ్కర్ మార్గం సదా అనుసరణీయమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డైక్‌మెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ప్రపంచంలో భారత దేశానికి ప్రత్యేక స్థానం దక్కిందని చెప్పారు. ఆయన బాల్యంలో ఎదుర్కొన్న వివక్షతను రూపుమాపేందుకు అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కొలంబియా విశ్వవిద్యాలయం ఆయనను గ్లోబల్ ఐకాన్‌గా గుర్తించడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. విశ్రాంత లెక్చరర్ డాక్టర్ మార్పు విన్సెంట్ పాల్ మాట్లాడుతూ అంబేడ్కర్ 40 సంవత్సరాలకు పైగా వ్యవస్థపై పోరాడాడన్నారు. యూనివర్సిటీలో ప్రతి విభాగంలో ఒక సబ్జెక్టులో అంబేడ్కర్ పాఠ్యాంశాలను చేర్చాలన్నారు. రెక్టార్ ఆచార్య కే రత్న షీలా మణి మాట్లాడుతూ అంబేడ్కర్‌కు నివాళులర్పించే క్రమంలో ఆయనను తెలుసుకోవడం ముఖ్యమన్నారు. నేటికీ కొన్ని గ్రామాల్లో వివక్ష కనిపిస్తూనే ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ అంబేడ్కర్ మనదేశంలో జన్మించకపోయినట్లయితే ప్రపంచం కొనియాడే భారత రాజ్యాంగాన్ని మనం కోల్పోయేవారమని అన్నారు. అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్, వికాస అధ్యక్షుడు ఎస్.ప్రసాద్, కార్యదర్శి జె. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డి.విజయ్ ప్రకాష్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ బ్రహ్మాజీ రావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ గంగాధరరావు

వైఎస్ జగన్‌ను కలిసిన అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం ఆ పార్టీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్ జగన్ కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై మాట్లాడినట్టు తెలిపారు. అనంతరం కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉండాలని, పార్టీ పటిష్టతకూ కృషి చేయాలని జగన్ సూచించినట్టు మురళీకృష్ణకు తెలిపారు.

బదిలీలకు రంగం సిద్ధం...!

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాత్ర కీలకంగా మారింది.. వారే కాంట్రాక్టర్లుగా.. మరికొంత మంది బినామీ కాంట్రాక్టర్లుగా పనులు చేస్తూ.. ఏళ్లను శాసించే స్థాయిలో ఉండటంపై గురువారం సాక్షి దినపత్రికలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం అనే కథనం ప్రచురితమైంది. దీనిపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సీరియస్ అయినట్లు సమాచారం. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో, ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారో అని వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. దీర్ఘకాలికంగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని బదిలీ చేసి వారిపై నిరంతర నిఘా పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్‌హక్



మంచాల గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దారు కే శ్రీనివాసశర్మ

మామిళ్లపల్లి సదస్సులో 15 అర్జీలు స్వీకరణ

పొన్నూరు: రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అమలు చేసిన రెవెన్యూ సదస్సుకు స్పందన కరువైంది. ప్రజా సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కారం చేసే విధంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి అర్జీలు రాకపోవడమే అందుకు నిదర్శనం. శుక్రవారం పొన్నూరు మండలంలోని మామిళ్ల పల్లిలోని గ్రామ సచివాలయం ఆవరణలో నిర్వహించిన సదస్సులో మండల రెవెన్యూ యంత్రాంగం పాల్గొన్నారు. దరఖాస్తులను స్వీకరించి వెంటనే సర్టిఫికెట్లు అందించేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సదస్సు సాయంత్రం 5 గంటల వరకు సాగింది. అయితే ప్రజల నుంచి అర్జీలు మాత్రం 15 మాత్రమే వచ్చాయి. వాటిలో మ్యుటేషన్లకు 5, రీప్లేస్‌మెంట్‌కు 3, ఫ్యామిలీ సర్టిఫికెట్ 2, డిజిటల్ సిగ్నేచర్‌కు 2, ఇన్‌కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం 3 దరఖాస్తులు వచ్చాయని డీటీ రాజా రమేష్ తెలిపారు.

-కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ మాట్లాడుతూ మ్యుటేషన్లు, కరక్షన్లు, సర్వే సమస్యలు, జీఎస్‌డబ్ల్యూఎస్(ఇన్‌కమ్, క్యాస్ట్) సర్వీసులను ఉచితంగా సదస్సులో అందిస్తున్నట్లు అన్నారు. గ్రామాల్లో జరిగే సదస్సుల్లో ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఎండోమెంట్ ఈఓ మల్లెల రమేష్, వీఆర్ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణకోడూరులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సుకు ఏర్పాట్లు చేశారు.

మొక్కుబడిగా రెవెన్యూ గ్రామసభలు

చేబ్రోలు: రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని చేబ్రోలు తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు మండలం మంచాలలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభల మొదటి రోజు కార్యక్రమం జరిగింది. మంచాల గ్రామంలో మొదటి రోజు జరిగిన గ్రామసభలు మొక్కుబడిగా ప్రారంభమయ్యాయి. కొద్ది మంది అధికారులతో ఆలస్యంగా సమావేశం ప్రారంభమైనప్పటికి ప్రజల నుంచి అడంగల్‌లో నంబరు తప్పులు, సర్వే నెంబరుల విషయాలపై ఐదు ఆర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని ఎస్టీ కాలనీ రెవెన్యూ, సచివాలయ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల బృందం పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కాలనీలో డ్రెయినేజి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, ఆర్ఐలు పి.శ్రీనివాసరావు, అజీజ్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో నాగమల్లేశ్వరరావు, దేవదాయశాఖాధికారి పి.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొరవడిన ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ

పరిధి ఎక్కువ... సిబ్బంది తక్కువ

- మద్యం అక్రమాలపై తనిఖీలు శూన్యం
- తొమ్మిది మందితోనే విధులు...
- పొన్నూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఉన్నవారికి పెరిగిన పనిభారం



నిడుబ్రోలు రైల్వేస్టేషన్ రోడ్డులో డివైడర్‌పై మద్యం తాగుతున్న మందుబాబులు(ఫైల్)

పొన్నూరు: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌కు కష్టాలు తప్పడం లేదు. సిబ్బంది తక్కువగా ఉండి పరిధి మాత్రం చాంతాడంత ఉండటంతో పని ఒత్తిడితో అధికారులతో పాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న కొద్ది మంది సిబ్బందికి తమ స్టేషన్ విధులను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి. మద్యం అధిక ధరలను కట్టడి చేయడం, బెల్టు దుకాణాలను అరికట్టడం, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలను కట్టడి చేయాల్సి ఉండగా సిబ్బంది కొరత కారణంగా తమ విధులను సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అక్రమ కార్యకలాపాలపై లేని పర్యవేక్షణ

నూతన మద్యం విధానాన్ని అమలు చేసిన కూటమి ప్రభుత్వం సెబ్ విభాగాన్ని ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. ఎక్సైజ్ విభాగం అధికారులకు ప్రభుత్వ మద్యం దుకాణాల పర్యవేక్షణను అప్పగించారు. ఎక్సైజ్ స్టేషన్ పనికి సరిపడా సిబ్బందిని కేటాయించ లేదు. పరిధి ఎక్కువ ఉండటం సిబ్బంది లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అరకొర సిబ్బంది

పొన్నూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ, ఎస్ఐ, ఏడుగురు కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. వారిలో ముగ్గురు సెంట్రీ, కోర్టు, చెక్‌పోస్టు డ్యూటీకి ఒకరు వెళుతున్నారు. మొత్తం నలుగురు కానిస్టేబుళ్లు ఇతర విధులు నిర్వహిస్తుండగా మిగిలిన ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక సీఐ, ఎస్ఐతో మూడు(పొన్నూరు, పెదనందిపాడు, కాకుమాను) మండలాల్లో జరిగే అక్రమ కార్యకలాపాల కట్టడి బాధ్యతలు సాధ్యమయ్యే పని కాదని అధికారులే చెబుతుండటం విశేషం. జిల్లాలో పొన్నూరు ఎంతో కీలకమైన పట్టణం. ఈ ప్రాంతంలో జరగని అక్రమ కార్యకలాపాలంటూ లేవు. తక్కువ సిబ్బంది ఉన్నందున ఉన్నవారికి పనిభారం పెరగడంతో నేర నియంత్రణ కష్టంగా మారింది. పట్టణంలోని మద్యం షాపుల వద్ద బహిరంగ మద్యపానం, బార్లు సమయపాలన లేకపోవడం, గంజాయి నియంత్రణ లేకపోవడం వంటి అక్రమ కార్యకలాపాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. ఇదే కష్టమనుకుంటే పొన్నూరు స్టేషన్ సీఐకి అదనంగా(ప్రత్తిపాడు స్టేషన్ పరిధి) బాధ్యతలు అప్పగించడం మరింత పని భారాన్ని పెంచింది.

ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: అధికారులు రబీ సీజన్‌లో ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నగరంలోని జిల్లా వనరుల కేంద్రంలో ఆర్ఎస్‌కే సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ రబీలో విత్తుకున్న పంటలైన శనగ, మినుము, మొక్కజొన్న తదితర పంటల ఇన్సూరెన్స్ ప్రీమియం రైతులతో చెల్లించే విధంగా చూడాలన్నారు. మిరప పంటల సమగ్ర యాజమాన్యంపై లాం ఫాం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ రజనీ, అపరాల పంటలు జొన్న, మొక్క జొన్న పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్ వివరించారు. డీపీఎం కె.రాజకుమారి, వరిలో రెల్లు రాల్చు పురుగు నివారణ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఐ.సునీత, ఏడీఏ బీవీ శివకుమారి, వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ జయరామ్‌ప్రసాద్

లక్ష్మీపురం: చట్ట వ్యతిరేక చర్యలకు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్వీఎన్‌కాలనీలో శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంచినడవడిక విడనాడి పెడత్రోవన పట్టి యువత, విద్యార్థులు వారి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. మద్యం, మాదకద్రవ్యాల వంటి వాటి జోలికి వెళ్లకుండా చూసుకోవాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళుతున్నప్పుడు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం తెలియజేయాలన్నారు. ఇటీవల కాలంలో నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రధాన వీధుల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ సీఐ వీరేంద్ర బాబు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక సమావేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కు అందే ఫిర్యాదుల పరిష్కారం, అందించే ఎండార్స్‌మెంట్‌లు విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఎండార్స్‌మెంట్‌లపై ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. తొలుత పీజీఆర్ఎస్‌కి ఇచ్చిన ఎండార్స్‌మెంట్స్‌ను పరిశీలించి, ఫిర్యాదుదారు ఇచ్చిన ఫిర్యాదును రీ ఓపెన్ చేసిన, సంతృప్తి చెందని వాటికి విభాగాధిపతే నేరుగా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని ఎండార్స్‌మెంట్స్‌లో సమగ్రంగా వివరణ ఉండటంలేదని, విభాగాధిపతులు, క్షేత్ర స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యల పరిష్కారం తేలిక అవుతుందన్నారు. ఈ-ఆఫీస్ ఫైల్ తప్పనిసరిగా విభాగ సూపరింటెండెంట్ ద్వారానే ఫార్వార్డ్ అవ్వాలని చెప్పారు. అదే విధంగా శనివారం స్కూల్‌ల్లో నిర్వహించనున్న పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌కు స్కూల్స్ వారీగా సీనియర్ అధికారులను ఇన్‌చార్జిలుగా విధులు కేటాయించాలని డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావుని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలజీ బాషా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి



కాకుమాను: గ్రామాలలో భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సుల నిర్వహణపై వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సులలో కౌలు రైతులకు ఎల్ఈసీ కార్డుల మంజూరు, భూ తగాదాలు, భూ సేకరణ, సెక్షన్ 22ఏ తారుమారు వంటి సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించాలని కోరారు. సదస్సులు ఈనెల 10వ తేదీన వల్లూరు, 12న పాంద్రపాడు, 13న బీకేపాలెం, 17న గరికపాడు, 18న తెలగాయపాలెం, 20న అప్పాపురం, 21న కొండపాటూరు, 24న కొమ్మూరు, 31న గార్లపాడు, డిసెంబర్ 2వ తేదీన రేటూరు, 4న కాకుమాను, 7న కొల్లిమర్ల, 8వ తేదీన బోడిపాలెం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపు ఉచిత వైద్య సలహా శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈనెల 8న 'చర్మ వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం- బి.పి.,షుగర్ బాధితుల్లో చర్మ సమస్యలు చికిత్సా విధానాలపై శాస్త్రీయ అవగాహన సభ 'నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుండి 12గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్.హెచ్.ఓ . భవనంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

జిల్లాలో టీచర్ల నూరుశాతం హాజరు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు శుక్రవారం పూర్తిస్థాయిలో హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న 5,349 మంది ఉపాధ్యాయుల్లో ఏ ఒక్కరు గైర్హాజరు కాకుండా, సెలవులు పెట్టకుండా నూటికి నూరుశాతం పాఠశాలలకు హాజరైనట్లు డీఈఓ సీవీ రేణుక ప్రకటించారు.

KASTURIBAI COLLEGE OF EDUCATION FOR WOMEN
(Approved by NCTE, Bangalore, Affiliated to A.N.U Guntur,AP)
Surya Lanka Road, Bapatla, Bapatla(Dt), Ph.No.Cell: 9704388088, 9291666275
B.ED ADMISSIONS NOTIFICATION CATEGORY-A & B
EDCET CODE: KSTB
Applications are invited from the eligible candidates for academic year 2024-2025 Under Management and SPOT Admissions Seats (Category "A & B" and Left over Seats) into B.Ed application forms can collect from college office. Last date of submission of applications is 13/12/2024. Selection will be made as per the APSCHE guidelines.
BAPATLA PRINCIPAL
06-12-2024

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com